రైతు గుండెలపై ఇసుక మేట

- తిమ్మాసికుంటకు గండి • నీట మునిగిన 101 ఎకరాలు • రూ.2.12 కోట్ల నష్టం
- ఒర్రెలు, కల్వర్టుల వద్ద పంటలకు దెబ్బ • బోయినపల్లిలో 215 ఎకరాల్లో ఇసుక మేట



ఈ రైతు పేరు ఐలాపురం వెంకటరమణ. బోయినపల్లి మండలంలోని తడగొండకు చెందిన దివ్యాంగ రైతు తనకున్న మూడెకరాలలో వరి పంట వేశాడు. నాట్లు వేసి 20 రోజులైతాంది. ఐదు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వరద పోటు కల్వర్టు మీదుగా వరి పొలంలో చేరింది. పొలం పరిసరాల్లో పెద్దకయ్యలు పడి ఇసుకమేటలు, గుండ్లు పడి మూడెకరాల వరి చేను పనికిరాకుండా పోయింది.



వరి పంట పొలంలో ఇసుక మేట

ఎల్లారెడ్డిపేట: ప్రతి ఏడాది అన్నదాత అధిక వర్షాలతో అపార నష్టం చవిచూస్తునే ఉన్నాడు. చెరువులు గండిపడడంతో పంటపొలాల్లో ఇసుకమేటలు వేసింది. ఇప్పటికీ పెట్టిన పెట్టుబడి నష్టం కాగా, పొలాల్లో వేసిన ఇసుక మేటలను తొలగించేందుకు రైతులు అదనంగా వేలాదిగా రుపాయలు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో రైతులు తమ పొలాల్లో ఇసుకమేటలు ఎలా తొలగించాలనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేట శివారులో తిమ్మాసికుంటకు గండిపడి 80 మంది రైతులకు చెందిన 101 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా నీట మునిగింది. పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది. అన్నదాతలు ఎకరానికి రూ.21 వేల చొప్పున 101 ఎకరాలకు రూ.2.12 కోట్లు ఖర్చు చేశారు. ఆదిలోనే వర్షాలతో పంట నీట మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ నష్టంతో రైతులు విలావిలాడుతున్న అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం దారుణం. ప్రకృతి వైపరీత్యం మూలంగా జరిగిన నష్టాన్ని కనీసం అంచనా వేసి ప్రభుత్వానికి పంపించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోలుకోలేని దెబ్బ..

చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా, పుట్టెడు ఆశతో రైతులు తిమ్మాసికుంట ఆయకట్టు కింద 101 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న వరి పంటలపై ప్రకృతి పగబట్టింది. దీంతో రైతులకు పెట్టుబడి రూపంలో చేసిన అప్పులు మిగిలాయి. వరి విత్తనాలు మొదలుకొని మందులు, దుక్కులను సాగు చేయడం, వరినాట్ల వరకు ఎకరాకు రూ.21 వేల చొప్పున ఖర్చు చేశారు. ఒక్కో రైతుకు చెందిన నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు పంట నీట మునిగింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఏడు ఇదే తంతు..

తిమ్మాసికుంట ఆయకట్టు కింద పంటలను సాగు చేసిన రైతులు ప్రతి సీజన్‌లో వర్షాల ధాటికి గురి కావాల్సివస్తోంది. శాశ్వతంగా మరమ్మతు చేయని కారణంగానే ఈ పరిస్థితి తలెత్తుతోందని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుల విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. ఈ కుంట దుస్థితిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా, నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించి, శాశ్వత నిర్మాణానికి అయ్యే ఖర్చుపై అంచనాలు వేస్తామని అధికారులు వెల్లడించారు. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ 80 మంది రైతు కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని తిమ్మాసికుంటకు శాశ్వత మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



బోయినపల్లి: వరి చేలో వేసిన ఇసుక మేట

బోయినపల్లి: మండలంలో ఇసుక మేటలు వేసిన పంట 215 ఎకరాలు..

➡ బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ పరిసరాల్లో బొటుకు సాయిలు కుటుంబం సుమారు 2 ఎకరాల మేర పత్తి పంట వేసింది. ఎకరం మేర పత్తి చేలో ఫీట్ ఎత్తులో ఇసుక మేటలు వేసింది.

➡ బోయినపల్లి బొజ్జ ప్రభాకర్‌కు చెందిన మూడు ఎకరాల మేర వరి చేలు రెడ్డికుంట మత్తడితో వరద పోటుతో పూర్తిగా ఇసుక మేటలు వేసింది. వరద నీటితో రామాలయ పూజారి కల్వకుంట్ల శ్రీనివాసాచార్యుల పత్తి చేలో 30 గుంటల మేర కయ్య పడింది. ముఖ్యంగా తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, మల్కాపూర్, కోరెం గ్రామాల్లో రైతుల పంటల్లో ఇసుక మేటలు వేశాయి.

➡ బోయినపల్లి నుంచి మర్లపేట గ్రామం వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు తెగడంతో ఆ ప్రాంతంలో పలువురు రైతులకు చెందిన సుమారు పది ఎకరాల మేర వరి పంట నీళ్ల పాలైంది.

➡ కోరెం గ్రామంలో కిష్టమ చెరువు మత్తడికి రైతుల వరి, పత్తి చేలు నీట మునిగాయి.

➡ మల్కాపూర్ గ్రామ చెరువు పరిసరాల్లో ఉన్న కోరెపు నర్సింగం తదితర రైతుల వరి చేలలో ఇసుక మేటలు వేశాయి. బూర్గుపల్లి గ్రామానికి చెందిన నల్లకుంట మత్తడితో పరిసరాల్లో రైతుల పత్తి, వరి పంటల్లో ఇసుక మేటలు వేశాయి.

తీవ్రంగా నష్టపోయాం



చెరువులు పూర్తిగా నిండడంతో పంటలు విస్తారంగా సాగు చేశాం. పంటల సాగుకు ఎకరాకు రూ.21 వేల వరకు ఖర్చు చేశాం. కింది మందులు అన్ని కొట్టాం. పంట ఏపుగా పెరుగుతున్న క్రమంలో వర్షాలు దెబ్బతీశాయి.దీంతో తీవ్రంగా నష్టపోయాం. తిమ్మాసికుంటకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

– సందుపట్ల మహేందర్‌రెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

రైతులను ఆదుకోవాలి



తిమ్మాసికుంట కింద పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి. నష్టపోయిన పంటలను అధికారులు ఇప్పటికీ పరిశీలించడం లేదు. అధికార పార్టీ నాయకులు మంత్రితో మాట్లాడి వెంటనే నష్టం అంచనాలను తయారు చేసి కలెక్టర్‌కు నివేదించాలి. ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలి.

– సందుపట్ల రాజిరెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

ఎప్పుడూ ఇదే సమస్య



గ్రామంలోని నర్సరీ పరిసరాల్లో మూడు ఎకరాల మేర వరి పంట వేశా. నారు ఎదిగింది. పంట మంచిగా ఉంది. ఐదు రోజుల కింద రెడ్డికుంట వరద పోటు వరి పొలం మీదుగా పోయింది. వరి కనపడకుండా మూడు ఎకరాల్లో రెండు ఫీట్ల మేర ఇసుక మేటలు వేసింది. ప్రతీసారి వర్షాకాలంలో వరదతో పంటలు దెబ్బ తింటున్నాయి.

– బొజ్జ ప్రభాకర్, బోయినపల్లి

క్లుప్తంగా

పంట నష్టంపై సర్వే



ముస్తాబాద్: రామలక్ష్మణపల్లెలో ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న ఏవో

ముస్తాబాద్/వేములవాడరూరల్: వర్షాలతో నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి, బొల్లారం, ఎదురుగట్ల, జయవరం, మల్లారం, ముస్తాబాద్ మండలం ఆవునూర్, తుర్కపల్లి, గూడెం, రామలక్ష్మణపల్లె, కొండాపూర్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని రైతులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వేలాది పెట్టుబడులు పెట్టి వేసుకున్న పంటలు తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన దానిపై అధికారులకు వివరిస్తూ కంటతడి పెట్టుకున్నారు. నష్టం జరిగిన పంట వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయికిరణ్, వెంకటేశ్, ఏఈవో అనూష, సందీప్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు అవాక్కులు చెవాక్కులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, నాయకులు వలకొండ వేణుగోపాల్ రావు, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, సురభి నవీన్ రావు, సిలివేరి చిరంజీవి, ఆత్మకూరి రంగయ్య, నీరటి బాబు, సిలివేరి సంజీవ్, సావనపల్లి దేవయ్య పాల్గొన్నారు.

పోలీస్ మీ కోసం..



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామంలో వేములవాడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ మీ కోసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారీ, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న సమస్యలకు గోడలు పెట్టుకుని ఇబ్బందులు కాకుడాదన్నారు. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేశ్, సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శ్రీనాథ్‌రాజ్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పిండ ప్రదానం

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు ఇల్లంతకుంట వివేకానంద చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సోమవారం పిండప్రదానం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కోల్పోయి తీవ్ర నష్టం చవిచూసిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంతగిరి వినయ్‌కుమార్ మాట్లాడుతూ వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినా ప్రభుత్వం రైతులను ఆదుకోలేదని, స్థానిక ఎమ్మెల్యే కూడా రైతులను పరామర్శించలేదన్నారు. రైతులకు పరిహారం అందించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పసుల వెంకటి, బాల పోచయ్య, జమాల్, సంతోష్, నరేష్, సంపత్‌రెడ్డి, కోటేశ్వర్, రాజేంద్ర, రమేశ్, బాబు పాల్గొన్నారు.

అడ్డుకున్న పోలీసులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం, మంత్రికి పిండప్రదానం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ముందే సమాచారం అందుకున్న ఎస్సై శేఖర్ రాజీవ్‌చౌక్‌కు చేరుకుని పిండాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రయత్నంలో కాంగ్రెస్, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పిండాలను లాక్కున్న కాంగ్రెస్ నాయకులు డ్రైనేజీలోకి విసిరివేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలతో రైతాంగం ఆగమవుతుంటే సీఎం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం సర్వేకూడా చేపట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జెల రాజు, దుబ్బాక రాజు,రమేశ్, భాను, రాజు, కుమార్, రాజిరెడ్డి, ప్రశాంత్, రాంరెడ్డి, నర్సింలు, మహేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి, నరేశ్, విజయ్‌రెడ్డి, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



పిండ ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిత్రకథ



అదుపు తప్పితే అంతే సంగతులు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో కల్వర్టు బోరింగ్ మూల పరిసరాల్లో వరద పోటుకు సుమారు మీటర మేర పెద్ద కయ్య పడింది. ఈ కయ్యతో బోరింగ్ కింద ఉన్న కేసింగ్ పైపు కనిపిస్తుంది. వాహనదారులు ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కయ్యలో పడే ప్రమాదం పొంచి ఉంది.

సమాచారం

కేజీబీవీలో నాన్ టీచింగ్ స్టాఫ్‌కు దరఖాస్తులు

బోయినపల్లి/చందుర్తి: బోయినపల్లి, చందుర్తి కస్తూర్బా బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో స్వీపర్, అసిస్టెంట్ కుక్‌ల ఎంపిక కోసం దరఖాస్తులు అందించాలని కోరారు. 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉన్న దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హత వివరాలు, తహసీల్దార్‌తో నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి జత చేయాలని సూచించారు. ఈ నెల 1 నుంచి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు బోయినపల్లి ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

నియామకం

గౌడ సంఘం సహాయ కార్యదర్శిగా ప్రశాంత్

సిరిసిల్లఅర్బన్: జిల్లా గౌడ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శిగా గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్‌ని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన గౌడ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చంద్రయ్య

కోనరావుపేట/గంభీరావుపేట: పశువుల ఆరోగ్యం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ కోరారు. మండలంలోని ధర్మారం, గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్‌లో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ధర్మారం గ్రామంలోని 135 గేదెలకు, 48 ఆవులకు, 183 ఎడ్లకు గాలికుంటువ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గున్నాల అరుణ, ఎంపీడీవో రామకృష్ణ, పశువైద్యాధికారి అంజిరెడ్డి, గంభీరావుపేట పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, పాల కేంద్రం అధ్యక్షుడు నర్సింగారావు, మండల వార్డు సభ్యుల ఫోరం కన్వీనర్ బండ రమేశ్ పాల్గొన్నారు.

ఆయుధాల పరిశీలన

వేములవాడ: తమ భద్రత కోసం లైసెన్సుడ్ ఆయుధాలు గల వ్యక్తులను సోమవారం డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ పరిశీలించారు. గన్ లైసెన్స్ ఉన్న వ్యక్తులను కార్యాలయానికి పిలిపించి, అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా ఆయుధాలు వాడుతున్న వారి వివరాలను 87126 56412, 87126 56413 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

హుండీ లెక్కింపు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో ఈ నెల 02న హుండీ లెక్కింపు ఉంటుందని ఆలయ ఈవో మారుతి తెలిపారు.

వృద్ధులకు గొడుగులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలోని 50 మంది వృద్ధులకు రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఉపసర్పంచ్ సంధ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జనహితకు 4 దరఖాస్తులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యలను సత్వర పరిష్కారం కోసం జనహిత కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. అన్ని శాఖల అధికారులు జనహిత కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

చెక్‌డ్యామ్‌ల పరిశీలన

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, మరిమడ్ల గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లను ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. భారీ వర్షాలకు అన్ని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పొలాల్లో ఇసుక మేటలు, మట్టితో నింపాయి. చెక్‌డ్యామ్‌ల కారణంగా జరిగిన నష్టాలను, పొలాల్లో ఇసుకమేటలను పరిశీలించారు. గొల్లపల్లి(వట్టిమల్ల)లో తెగిపోయిన కల్వర్టులను చూసి గత 40 సంవత్సరాల కాలంలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదైంది ఈ యేడేనన్నారు. వారి వెంట ఎంపీపీ చంద్రయ్య, డీఈ సత్యనారాయణ, ఏఈలు అశోక్, సాగర్, సర్పంచులు గోవు పర్శయ్య, మాట్ల అశోక్, మల్యాల దేవయ్య, మూలవాగు ప్రాజెక్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డి, రైతులు ఉన్నారు.

చెక్‌డ్యాం వల్ల నష్టం

వేములవాడరూరల్: వర్షాలతో చెక్‌డ్యాం కొట్టుకుపోయి తమ పంట పొలాలు దెబ్బతిన్నాయని, దీంతో తీవ్రంగా నష్టపోయామని బొల్లారం, లింగంపల్లి గ్రామాల రైతులు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ మొరపెట్టుకున్నారు. చెక్‌డ్యాం నిర్మించి సైడ్‌వాల్ నిర్మించకపోవడంతోనే తమకు నష్టం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ధ్వంసమైన చెక్‌డ్యాంలను, నష్టపోయిన రైతులను సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజాప్రతినిదులు చెక్‌డ్యాంల నిర్మాణాల వల్ల జరిగిన నష్టాన్ని అధికారికి వివరించారు. బొల్లారం శ్మశానవాటికకు వెళ్లేందుకు కూడా దారి లేదని ఆయనకు గ్రామస్తులు వివరించారు. దీనికి స్పందించిన ఆయన రెండు రోజుల్లో మరమ్మతు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని వారికి వివరించారు.



డీఈకి మొరపెట్టుకుంటున్న గ్రామ రైతులు

పనులు అడ్డుకున్న కార్మికులు




ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలను అధికారులు సోమవారం ఇతర కూలీలతో తొలగింప చేసే పనులను పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. ఒకవైపు వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని చేపట్టిన నిరవధిక సమ్మెను విచ్చినం చేయాలనే కుట్రతోనే అధికారులు కూలీలతో చెత్త ఏరివేసే పనులు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 రోజులుగా సమ్మె చేస్తున్న స్పందించని అధికారులు ఇప్పుడు గ్రామాల్లో చెత్త పేరుకుపోయిందని, ప్రైవేటు వ్యక్తులతో శుభ్రం చేయించడం సరైంది కాదన్నారు. సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు పంచాయతీ కార్మికులకు మద్దతు పలికారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఇరువర్గాల వారిని శాంతింపచేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎల్లారెడ్డిపేట: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ మండల అధ్యక్షులు జక్కుల మహేందర్ అన్నారు.ఎల్లారెడ్డిపేటలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అనంతరం సిరిసిల్లలో కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్మికులు నర్సయ్య, భారతి, లక్ష్మి, రాములు, లింగవ్వ, శంకర్, సాయి, దేవేందర్ పాల్గొన్నారు.

పౌరుల హక్కులు కాపాడాలి

బోయినపల్లి/ఇల్లంతకుంట/వీర్నపల్లి: సమాజంలో పౌరుల హక్కులు కాపాడడానికి, వివక్షలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొట్టెపెల్లి సుధాకర్ అన్నారు. బోయినపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచు కందుల కరుణ, ఎంపీఓ ప్రణీత, ఆర్ఐ ప్రభాకర్ పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఎంపీడీవో మీర్జా, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు, సర్పంచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. వీర్నపల్లి మండలం బాబాయి చెఱువు తండా గ్రామంలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, సర్పంచ్ భూక్య లక్ష్మి, ఉప సర్పంచ్ రాములు, కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

సంక్షిప్త వార్తలు

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందించాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల లోపు ఉన్నవారికి ఉచిత విద్యుత్ అందడం లేదని, అర్హులైన వారందరికి ఉచిత విద్యుత్‌ను అందించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు అందించాల్సిన వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉచిత విద్యుత్‌ను అందిస్తూ కేవలం మండల కేంద్రంలో అందించకపోవడం అన్యాయమన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ఎల్లారెడ్డిపేట: మేజర్ గ్రామ పంచాయతీలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం ఫాగింగ్ చేశారు. పంచాయతీ కార్మికులు నిరవధి సమ్మె చేస్తుండడంతో మురుగు కాలువలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు ఎంపీడీవో చిరంజీవి ఆదేశాలతో ప్రైవేట్ సిబ్బందిచే ఫాగింగ్ చేశారు.

సెస్ కార్యాలయం మార్పు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని సెస్ విద్యుత్ వినియోగదారుల కార్యాలయం రామాలయం గుడి ప్రాంతం నుంచి ఎంపీటీసీ కోడి అంతయ్య ఇంటి ఎదురుగా మారిందని సెస్ ఏఈ స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. సెస్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాబురావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఆదివాసులు, లంబాడిల మధ్య చిచ్చుపెడుతున్న ఎంపీ సోయం బాబురావును వెంటనే బీజేపీ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఆజ్మీరా తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం 6 శాతం నుంచి 10 శాతం పెంచిన రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఎందుకు అనుమతించడం లేదన్నారు. తెగల మధ్య చిచ్చుపెట్టి వారు రిజర్వేషన్లు పెంచుతారా అని ప్రశ్నించారు. గిరిజన ద్రోహి బాబురావు కుటిల నీతిని గిరిజన జాతి గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

జర్నలిస్టుల పోస్టుకార్డు ఉద్యమం

చందుర్తి: జర్నలిస్టు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు లాండే ప్రసాద్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు గొట్టే మనోహర్, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికి హరిత మొక్కలు

గంభీరావుపేట: మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం మహిళలకు హరిత హారం మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిలో రెండు మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, ఐకేపీ సీసీలు, సీఏలు స్వయం సహాయక సంఘం మహిళలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.